క్లుప్తంగా

పాత్రికేయులకు సన్మానం



విలేకరులను సన్మానించిన ఉపాధ్యాయులు

మునిపల్లి(అందోల్): జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి గంధం మల్లికార్జున్ ఆధ్వర్యంలో పత్రిక విలేకరులను శాలువా కప్పి సన్మానించారు. శనివారం మండల కేంద్రం మునిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మునిపల్లి మండల పత్రిక విలేకరులను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కల్పన, ఉపాధ్యాయులు ఉషశ్రీ, స్వరూప, ఆంజనేయులు, కరుణాకర్‌రెడ్డి, సుభాష్‌రావు, చంద్రమౌళి, కవిత, మధురిమ, అరుణ, ప్రవీణ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ పాషా, అష్ఫాఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు సునంద్‌రావు రాజీనామా



సదాశివపేట (సంగారెడ్డి): ఇరవై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించిన 22వ వార్డు కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏగమామిడి సునంద్‌రావు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయాల్లో నైతిక విలువలు దిగజారుతున్నందువల్ల రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఏపార్టీలో చేరే ఆలోచన లేదని తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత



బాధితుడికి ఎల్‌ఓసీ అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సయ్యద్ సలీమోద్దీన్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థికంగా ఆదుకోవాలని స్థానిక కాంగ్రెస్ నాయకులను బాధిత కుటుంబ సభ్యులు కోరారు. దీంతో విషయాన్ని వారు ఎంపీ సురేష్ షెట్కార్‌ను దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సీఎం సహాయనిధి నుంచి రూ. 5 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. శనివారం కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ సభ్యులు అశోక్, శుక్లవర్ధన్‌రెడ్డి, రంజోల్ నరేష్‌గౌడ్‌లు బాధితుడికి ఎల్‌ఓసీని అందజేశారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాలు



వ్రతాలు నిర్వహిస్తున్న దంపతులు

నారాయణఖేడ్: పట్టణంలోని భూమయ్య కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శనివారం ఆలయ నాల్గోవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష అభిషేకం, సహస్ర నాగవల్లి దళార్చక, సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గురుజ్యోషి సామూహిక సత్యనారాయణ వ్రతాల ఫల విశేషాలను వివరించారు. అనంతరం మహాప్రసాద వితరణ చేశారు.

శిక్షణతో ప్రయోజనం



మాట్లాడుతున్న రోహిత్‌కుమార్

సంగారెడ్డి టౌన్ : ఉత్పత్తి, వ్యాపార రంగాల్లో వ్యక్తిగతంగా మనం ఎదిగితే దేశాభివృద్ధి జరుగుతుందని స్టేట్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రోహిత్ కుమార్ అన్నారు. శనివారం సంగారెడ్డిలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో నూతనంగా నిర్మించిన వర్క్ షెడ్డును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉచితంగా నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే, రుణాలు కూడా మంజూరు చేస్తారని తెలిపారు. అనంతరం టు వీలర్ వెహికల్ రిపేరింగ్‌లో శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడి.. ఇక్కడి సదుపాయాలు ఎలా ఉన్నాయని తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి స్టేట్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సూర్యప్రకాష్ రావు, స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వరికొయ్యలు తగలబెడితే నష్టమే

- భూసారం కోల్పోయి పంట దిగుబడి తగ్గుతుంది
- పొలాన్ని కలియ దున్నితేనే పంటలకు మేలు
- నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్



నూతన్‌కుమార్, ఏడీఏ నారాయణఖేడ్



వరికోతలు పూర్తికావడంతో మిగిలిన కొయ్యలు

కల్హేర్(నారాయణఖేడ్): వరికోతలు పూర్తయ్యాక కొయ్యలను తగలబెడితే అనర్థం వాటిల్లుతోంది. వరికొయ్యలతో వ్యవసాయ భూముల్లో పోషకాలు పెంచుకుని పర్యావరణం, భూసారానికి ఉపయోగకరంగా మార్చేందుకు రైతులు కొన్ని సలహాలు సూచనలు తప్పనిసరిగా పాటించాలి. నారాయణఖేడ్ డివిజన్ ఏడీఏ నూతన్‌కుమార్ రైతులకు సూచనలు చేశారు.

నేలలో కలపడం..

వరికొయ్యలను నేలలో కలపడం వల్ల సేంద్రియ ఎరువుగా మారి భూసారాన్ని పెంచుతాయి.

కంపోస్టు తయారీ: వరికొయ్యలు కంపోస్టు తయారీలో ఉపయోగపడతాయి. ఇది సహజ సిద్ధంగా ఎరువుగా పనిచేస్తాయి.

పశువుల మేతగా వినియోగం: వరి కొయ్యలను పశువుల మేతగా వినియోగించడం ద్వారా పశువులకు పోషకాలు అందించవచ్చు.

బయోచార్ తయారీ: నియంత్రిత ఆక్సిజన్ లేకుండా కొయ్యలను తగులబెట్టి బయోచార్ తయారు చేయవచ్చు. ఇది నేల తేమను నిల్వ చేయడంలో, భూసారాన్ని మెరుగుపరచడంలో సహాయ పడుతుంది.

మల్చింగ్: వరి కొయ్యలను మల్చింగ్ పదార్థంగా వాడటం వల్ల నేల తేమ కాపాడుతుంది. మొక్కలకు అనుకూల వాతావరణ లభిస్తుంది.

కాల్చడం వల్ల జరిగే అనర్థాలు: పంటల వ్యర్థాలను కాల్చడం వల్ల నత్రజని భాస్వరం పొటాషియం వంటి పోషకాలు ఆవిరైపోతాయి. తద్వారా భవిష్యత్తు పంటకు నష్టం జరుగుతుంది. అలాగే, వాయు కాలుష్యం ఏర్పడి ఊపిరితిత్తులు సమస్యలకు దారి తీస్తుంది.

జీవ వైవిధ్యం తగ్గడం

మట్టిలోని సూక్ష్మ జీవాలు దెబ్బతిని భూమి సమతుల్యతను కోల్పోతుంది.

నీటి నిల్వ తగ్గడం: కాల్చడం వల్ల మట్టిలో నీటి సామర్థ్యం తగ్గి భవిష్యత్తులో పంటలకు ఎక్కువ నీటి అవసరం ఉంటుంది.

ఫీజులు చెల్లించకపోవడం దారుణం

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాష
- విద్యార్థుల సమస్యలు పరిష్కారించాలని ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న సాయిబాష

సదాశివపేట(సంగారెడ్డి): మూసీ ప్రక్షాళనకు లక్షన్నర కోట్లు ఖర్చుపెట్టడానికి సిద్ధమైన కాంగ్రెస్‌ప్రభుత్వం విద్యార్థుల ఫీజులు రూ.7వేల కోట్లు చెల్లించక పోవడం దారుణమని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయిబాష ఆరోపించారు. శనివారం విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు, పట్నం మాణిక్యం ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో స్కాలర్‌షిప్ రూ. 20 వేలు ఇస్తున్నారని, ధనిక రాష్ట్రంలో రూ.15 వేలు ఇవ్వలేక విద్యార్థులు జీవితాలు నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు స్కాలర్‌షిప్‌లు రూ. 20 వేలకు పెంచాలన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కరమయ్యే వరకు పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ వీరేశంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రదీప్‌గౌడ్, వర్ధన్‌గౌడ్, మహేశ్ యాదవ్, జహంగీర్, శ్రీకాంత్, రోహిత్‌గౌడ్, అరుణ్, బన్నీ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత వివరాల సేకరణతో నష్టం

నారాయణఖేడ్: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా సేకరిస్తున్న వ్యక్తిగత వివరాలతో గోప్యతకు భంగం కలుగుతుందని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గణపతి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వేలో భాగంగా సేకరిస్తున్న ఫోన్‌నంబరు, బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు వివరాలు సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కితే సామాన్యులు బలైపోయే అవకాశం ఉందన్నారు. కొన్ని చోట్ల సర్వే అధికారులు మీరు ఏ పార్టీకి చెందినవారని అడుగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. అవసరమైన వివరాలు మాత్రమే సేకరించాలని కోరారు.

బహిరంగ సభకు తరలిరండి

మునిపల్లి(అందోల్): నేడు నిర్వహించనున్న బహిరంగ సభకు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించి, సంవత్సర కాలం అవుతున్న సందర్భంగా వార్షికోత్సవ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రభుత్వం సాధించిన ప్రగతి, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్: మండలంలోని పోతన్‌పల్లి (ఆర్) గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ఉప్పరి నాగన్న శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అలాగే, నాగలిద్ద మండలం గోందెగామకు చెందిన భీంరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి, యువజన కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యును పరామర్శించారు. అదేవిధంగా నాగలిద్దలో స్వర్గీయ వీరన్న ప్రథమ వర్ధంతిని నిర్వహించగా కాంగ్రెస్ నాయకులు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమగ్ర కుటుంబ సర్వే పరిశీలన



నారాయణఖేడ్: సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్

నారాయణఖేడ్: సమగ్ర కుటుంబ సర్వేను డిప్యూటీ తహసీల్దార్ రాజుపటేల్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు, ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న తీరు, వారు వివరాలు నమోదు చేస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లకు సూచనలు, సలహాలు చేశారు. ప్రజలు సర్వేకు సహకరించి, వివరాలు నమోదు చేయించాలని కోరారు.

కొనసాగుతున్న సర్వే

రాయికోడ్(అందోల్): మండలంలోని సింగితం, ధర్మాపూర్, యూసుఫ్‌పూర్ గ్రామాల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో 12,500 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉండగా, 396 కుటుంబాలు పూర్తయ్యాయి. 85 మంది ఎన్యుమరేటర్లు విధులు నిర్వహిస్తుండగా, 10 మంది సూపర్‌వైజర్లు సర్వేను పరిశీలిస్తున్నారని అన్నారు. సకాలంలో సర్వే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

బస్సులను పెంచుతాం

డిపో మేనేజర్ ఉపేందర్

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి డిపో పరిధిలో వివిధ రూట్లో బస్సుల సంఖ్యను పెంచుతామని సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ అన్నారు. శనివారం డయల్ యువర్ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందన్నారు. శంకర్‌పల్లి నుంచి శేఖర్ మాట్లాడుతూ.. శంకర్‌పల్లి రూట్‌లో అదనపు బస్సులు నడపాలని, కలబ్‌గూరు నుంచి కృష్ణ మాట్లాడుతూ.. సదాశివనగర్‌లో రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని, అలాగే, సంగారెడ్డి నుంచి సత్యనారాయణ మాట్లాడుతూ.. చిద్రుప్ప అందూరు మీదుగా బొంతపల్లికి బస్సులను నడపాలన్నారు . రాంసానిపల్లి వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆపాలని హనుమంతు కోరారు. వివిధ రూట్లో బస్సులను నడపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని త్వరలోనే అదనపు బస్సులను నడిపేలా చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ తెలిపారు.

ఘనంగా వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం కడ్పల్ లక్ష్మణ్‌నాయక్ తండాలో శనివారం సేవాలాల్ మహరాజ్, భవానీమాత మందిరం వార్షికోత్సవం నిర్వహించారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మందిరంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. భోగ్ భండార్, హోమం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, నాయకులు రవీందర్‌నాయక్, రమేష్, యాదవరావు, ధన్సింగ్, నర్సింగ్, విఠల్, పాల్గొన్నారు.

ప్రమాదకరంగా..

సంగారెడ్డి జోన్: ప్రధాన రహదారులపై పలువురు వాహనదారులు నిర్లక్ష్యంగా పరిమితికి మించి లోడు వేసుకొని ప్రమాదకరంగా రవాణా చేస్తున్నారు. గురువారం హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై ఓ వాహనదారుడు పరిమితికి మించి డ్రమ్ములను లోడు చేసుకొని వెళ్తున్నాడు. ఈ క్రమంలో డ్రమ్ములు ఓవైపునకు ఒరిగినా ప్రయాణం మాత్రం ఆపలేదు. డబ్బాలకు కట్టిన తాడు జారితే వెనకాల ఉన్న వాహనదారుల పరిస్థితి ఏంటని వెనకాల నుంచి వచ్చే వాహనదారులు, డ్రైవర్ తీరును విమర్శించారు.



ప్రమాదకరంగా డ్రమ్ములను తరలిస్తున్న వాహనం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జిన్నారం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా దేవరకొండ మండలం మరమడక గ్రామానికి చెందిన గడ్డం అనిల్ (24), భార్య చిన్నారితో కలిసి మండలంలోని అన్నారం గ్రామంలో ఉంటున్నారు. ఈనెల 15న గుమ్మడిదల ఆస్పత్రికి భార్యతో కలిసి బైక్‌పై వెళ్తున్న అనిల్‌ను అన్నారం సమీపంలోని ఓ పరిశ్రమ వద్ద వెనకనుంచి లారీడ్రైవర్ అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టాడు. దీంతో అనిల్ తలకు తీవ్రగాయాలు కాగా, భార్యకు ముఖంపై గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని బహదూర్‌పల్లిలోని ఎస్వీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మెరుగైన వైద్యం కోసం అనిల్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించారు. శనివారం చికిత్స పొందుతూ అనిల్ మృతి చెందాడు. భార్య చిన్నారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి పురస్కారాలు



అవార్డులు అందజేస్తున్న ఆర్‌ఎం జ్యోష్ణ

జహీరాబాద్ టౌన్: విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న ఆర్టీసీ సిబ్బందికి ప్రగతి చక్రం పురస్కారాలను రీజనల్ మేనేజర్ జ్యోష్ణ అందజేశారు. జహీరాబాద్ ఆర్టీసీ డిపోను శనివారం ఆమె సందర్శించారు. అక్టోబర్ నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్, కండక్టర్లు, హెల్పర్లు, శ్రామిక్, సూపర్‌వైజర్ వివిధ కేటగిరిలో నగదు పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె ఉద్యోగుల కృషి, సేవలను కొనియాడారు. అనంతరం ఆమె డిపోలో కలియదిరిగి.. గ్యారేజ్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం డ్రైవర్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇంధన పొదుపు ఆవశ్యకత గురించి వివరించి ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్ హుసేన్, అధికారులు ప్రవీణ్‌కుమార్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

నారాయణఖేడ్: పట్టణంలోని కాశీనాధ్ ఆలయంలో శుక్రవారం రాత్రి కార్తీక దీపోత్సవాన్ని పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణోత్సవం, దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆయన సతీమణి అనుపమా రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, పీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ నాయకులు సాగర్ షెట్కార్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు గురుజ్యోషి కార్తీక మాసంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించడం వల్ల కలిగే విశేషాలను వివరించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి చంద్రశేఖర్, ఆలయ పాలకమండలి సభ్యుడు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



పనులు పరిశీలిస్తున్న చంద్రారెడ్డి తదితరులు

జిన్నారం (పటాన్‌చెరు): సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ కౌన్సిలర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం 11వ వార్డు బీరప్ప బస్తీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ.. త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు భాస్కర్, స్థానిక నాయకులు సంపత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు నర్సింహ

జహీరాబాద్ టౌన్: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సింహ కోరారు. పట్టణంలోని శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల ఇళ్ల స్థలాల కోసం గత నాలుగు సంవత్సరాల నుంచి పోరాటాలు చేస్తున్నామని అన్నారు. పలుమార్లు ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. జిల్లా కలెక్టర్లను కూడా కలిశామన్నారు. కాని, ప్రభుత్వ యంత్రాంగం నుంచి ఎలాంటి స్పందనలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జలాలోద్దీన్, జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి నర్సింలు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా హజ్రత్ సిద్ధపీర్ ఉత్సవాలు



ప్రార్థనల్లో పాల్గొన్న ఉజ్వల్‌రెడ్డి తదితరులు

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని ఔరంగ్‌నగర్ గ్రామంలోని హజ్రత్ సిద్ధపీర్ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి ప్రారంభమైన ఉత్సవాలకు పలువురు ప్రముఖులు హాజరై దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనల్లో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం ఉత్సవాల ప్రాముఖ్యతను నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అర్షద్ పటేల్, గోవర్ధన్‌రెడ్డి, హన్మంత్‌రావు పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, ఎం.జి.రాములు, జావీద్, ఖాజామియా, మొయిజ్, జమీలుద్దీన్, అక్బర్, గౌసొద్దీన్ పటేల్, జుబేర్, నిజాం పాల్గొన్నారు.

దుర్గంధభరితంగా మురుగునీరు

- భరించలేని దుర్వాసన



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

సంగారెడ్డి జోన్: అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా ఇళ్ల మధ్యలో మురికినీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రం సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డు పరిధిలోని మంజీరానగర్ కాలనీలో రోడ్డు మురికినీటితో నిండిపోయింది. పక్కనే ఉన్న బాలుర వసతి గృహం నుంచి వచ్చే వ్యర్థా నీరు చిన్నపాటి కాల్వ నిండిపోయి రోడ్డుపై ప్రవహిస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నుంచి మూడు రోజులకు ఒకసారి మ్యాన్‌హోల్‌లో నుంచి నీరు రోడ్డుపైకి వచ్చి నిలుస్తుందని తెలిపారు. రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మురికినీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



మహాపడిపూజలో స్వాములు, భక్తులు

సదాశివపేట(సంగారెడ్డి): స్వామియే శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప నామస్మరణతో మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. శనివారం పట్టణంలోని 8వ వార్డు హనుమాన్‌నగర్ కాలనీలో కన్నెస్వామి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో జరిగిన మహాపడిపూజలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు, గురుస్వాములు సుధాకర్‌గౌడ్, గోనె శంకర్, గడీల కృష్ణగౌడ్, సూరిగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, రాంచందర్, యాదగిరి, శ్రీకాంత్‌గౌడ్, సుభాష్, నర్సింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్ నాగరాజ్‌గౌడ్, అనిల్, అయ్యప్పస్వాములు, హనుమాన్‌నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.